


## శ్రీకాంత్ :

హృదయపు కవాటాలు ఓరగా మూసుకుని అలసిన వూహలు మగతగా నిద్రపోతున్న వేళ, అదిగో ఆ కవాటాలమీద వేళ్ల చప్పుడులా ఆవిడగారి కారు డోరు శబ్దం. నాకు తెలుసు; ఉష నన్ను డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక తప్పని సరిగా సృష్టించాల్సి వచ్చిన శబ్దాన్ని వీలైనంత సున్నితంగా వాడుకుంటుందని.కానీ ఆ అమాయకు రాలికి తెలియదు. నా శరీరం ఎంతగా మొద్దుబారినా దాని సౌకుమార్యం కూడా వచ్చి చేరి మనసు మరీ నాజూకు తేలిందనీ, ఈ ఇంట ఉష వదలిన ఊర్పు కూడా నా మనో నాసికను స్పృశించగలదనీ.

మద్యంతో మర్డర్ చేద్దామనుకున్నా ఆమె తాలూకు వూహ చాలు నా ఆలోచనల్ని మళ్లీ బ్రతికించటానికి ! ఆలోచనల్నిండా ఆమె ! ఆమె కేంద్రమైన ప్రతి ఆలోచనా బాధా తప్త పరిధి !

ఓహ్ ! నా మనోమయ ప్రపంచం గ్లోబులా తిరుగుతోంది. దీన్ని స్థిరం చేయాలని ఉష తాపత్రయం. సూర్యుణ్ణి కదిలించటం, భూమిని కదలకుండా ఆపటం ఎవరి తరం ? నాదీ అంతే. అదే ఉషకు తెలియదు.

ఉష పైకి రాలేదు ఇంకా. వెంట అభిమానులు వచ్చారా ? రాలేదు. వస్తే మాటలు వినిపించేవి. ఉషలా వాళ్లకు శబ్దం కాకుండా మాట్లాడవలసిన అవసరం లేదు. ఉష పైకి రాకపోవటమే మంచిది. వస్తే యుద్ధం ప్రారంభ మవుతుంది. కోల్డ్ వార్ !

ఉష చూపుల వేడిలో నేను భస్మమైతే బావున్ను. ఆ చూపుల తూపులు నా అణు వణువునా దిగబడి నా ప్రాణాలు తీస్తే బావున్ను. కానీ అలా జరగదు. చల్లగా చూస్తుంది ఉష. ఎలా ? చల్లగా, చాలా చల్లగా, హిమ పాతంలా ! ఆ కురిసి కరడు గడ్తున్న మంచు మధ్య నా గుండె... రచయిత్రి కదా ? బాధను నవ్వుతూ చెప్పటం, ప్రాణాల్ని నిమురుతూ లాగేయటం వెన్నతోబెట్టిన విద్య.

''మీ ఈ స్థితికి నా రచనే కారణమైతే మీ కోసం, మీ తృప్తికోసం నేను రచన మానే స్తాను'' అంటుంది ఉష. నాకు తెలుసు ఆమె మనసులోనిమాట వేరు. ''మీ కాంప్లెక్స్ నాకు తెలుసు. దాన్ని పోగొట్టటంకోసం నేను రచన మానేస్తాను'' అని ఇదేనా ? ఇదే అని నా నమ్మకం. ఏమోమరి. అయినా అంత స్వార్థం నాలో లేదు. ఆమె ప్రగతిని నే నాపలేను. నాలో పెరుగుతూన్న న్యూనతనూ భరించలేను. ఈ సంఘర్షణ ఉష కర్థంకాదు. అర్థం కాకపోవటం మంచిదికూడా.

''మంచిగానీ చెడుగానీ మీ ఆలోచన నాకు చెప్పండి. స్వచ్ఛంగా ఒక మార్గాన్నెన్నుకోండి. అది చెడే అయినా, నాకు అననుకూలమే అయినా ఫరవాలేదు. నా రచన వుద్దేశం సమాజానికి అణుమాత్రమైనా వుపయోగడాలని. ఒక జీవితం — అది నా జీవితమే అయినా — నా రచనవల్ల శిధిలమవుతుందంటే నా రచనకు అర్థమే లేదు. మానేస్తాను'' ఇదీ ఉష వాదన.

చెప్పానుగా. నాది అర్థంలేని బాధ. ఒక స్థితిలో నాకే అర్థంకాని బాధ. ఉష పైకి రావాలి. పేరు తెచ్చుకోవాలి. అయితే దానికి ఉష భర్తగా నా పాత్ర పేలవం కావడం నాకు ఇష్టంలేని విషయం. దీన్ని నా అసూయగా, ఈర్ష్యగా భావిస్తే అది మీ తప్పే అవుతుంది ఉష పైకివస్తే రానివ్వండి. పేరు తెచ్చుకుంటే తెచ్చుకోనివ్వండి. దానికి నా స్థానం బలహీనం కావడం ఏమిటి ! నా ఉనికి అప్రధానం కావటం ఎందుకు ? ఇదే నేను సహించలేను. నాలోనూ అందమైన ఆలోచన లున్నాయి. సున్నితమైన ఊహలున్నాయి. విప్లవాత్మకమైన భావా లున్నాయి. అంతెందుకూ, నా స్వగతం ఆ విషయాన్ని మీకు చెప్పటం లేథూ ? అయితే ఆవిడగారిలా నేను కలంలో జొప్పించలేను. కాగితంమీద పెట్టలేను. అంతే తేడా ! ఆ మాత్రానికి ఆమెగారికి బ్రహ్మరథం ! నా ప్రసక్తేమో ఎవరు ! అరె ! మళ్లీ ఉష కీర్తిని ఆక్షేపిస్తున్నానా? కాదు కాదు. అయినా ఇప్పటికి నా భావం, బాధ అర్థమయే వుంటుంది.

అబ్బ ! నా ఉదరసాగరంలో భీషణమైన అలలు ! ఎన్ని మద్యపు నదుల చేరిక నా ఉదర సముద్రం ! అలలు గుండెలవరకూ ఎగసి పడు న్నాయి !

పైనుంచి మరో జలపాతాన్ని దూకించాను. వాట్ 69. నా గుండెలు బండల్ని పిండి చేస్తూ... కడుపులోకి దూకి పతనమైంది.

ఆఁ ఏదో చెబుతున్నాను.

ఔను. గుర్తొచ్చింది.

మళ్లీ చెబుతాను. ఉష అంటే నాకు ప్రాణం. నో. ప్రాణాధికం. నా గుండెల్లో గుడి కట్టి ఆ సౌందర్య దేవతను నా ప్రేమ పుష్పాలతో అర్చిస్తూ, ఆరాధనా నీరాజనంతో హారతిపడ్తూ. నా గుండె పాత్రల్లో మెత్తగా ఒదిగి వుండ వలసిన ఉష — ఊహూ — ఎదిగిపోయింది, మహోన్నతంగా. ఆ ఔన్నత్యాన్ని నా చిన్ని గుండె భరించలేకపోయింది. నా గుండె గోడల్ని బద్దలు కొట్టుకుని పైకి ఎదిగిపోయింది ఉష, నేను కళ్లెత్తి, తల ఎత్తి చూసినా కనిపించనంత ఎత్తుగా. ఆమె ఔన్నత్యాన్ని నేను భరించలేనా? భరించగలను. కానీ ఆమె ఎత్తుకు ఎదగలేని నా నిస్సహాయత ఒలికే కన్నీటి ఒరవడిలో నా సహనం, ఉష ఉన్నతికి కలిగిన సంతోషం కొట్టుకుపోతు న్నాయి. ఏం చెయ్యను !

అయ్యో ! మళ్లీ మనసు కొలిమిలో ఆలో చనల చితుకులు అంటుకున్నాయి.

ఉదరగొట్టే పొగ, గొంతు గొట్టాన్ని వుక్కిరిబిక్కిరి చేస్తోంది, విపరీతమైన దగ్గు రాబోతోంది. సినిమాలో నాగేశ్వరరావుగారు గుర్తొచ్చి, సిగ్గుపడి బలవంతంగా ఆపుకున్నాను.

వాట్ ఎ ట్రాజెడీ !

ఉషలాంటి స్త్రీని నా కిచ్చి నా హృదయ కలశాన్ని ఆనంద రసంతో నింపిన ఆ దేవుడు ఈ ఒడిదుడుకుతో, ముఖ్యంగా ఇతరులకు చెప్పకోలేని, చెప్పినా అర్థంకాని ఒడిదుడుకుతో తొణికిపోయే ప్రమాదమూ సృష్టించాడు !

వాట్ ఎ ట్రాజెడీ ! కామెడీలా కనిపించే ట్రాజెడీ !! వాట్ ఎ ట్రాజెడీ !!!

ఉష అంటూ వుంటుంది. ''ఎందుకిలా దిగజారిపొయ్యారు! నాలో ఏమైనా లోపం వుందా? నావల్ల మీకు తృప్తిలేదా? నా అందం మీ సౌందర్యారాధనకు తగినట్టుగా లేదా? నేను మీకు అవమానం కలిగించే పనులు చేస్తున్నానా? ఏమిటి మీ బాధ?'' అని.

నా మనసు విరగబడి నవ్వుతుంది ఆ మాటలకు.

నా సౌందర్యారాధనకు ఉష అందం తగదా!? అసలందమంటే ఏమిటి ? ఉషకాదూ?

ఉష సౌందర్యం అపురూపం. అద్భుతం. కల్మష రహితమూ, కళా విలీనమూ అయిన ఆమె మనో సౌందర్యం ఆమె సౌందర్యానికి మరింత మెరుగులు దిద్దింది. వెలుగులు అద్దింది

ఉష నా భార్య అయినప్పుడు నాదైన ఆ అందాన్ని నలిపివేయలేదు.

ఆ సౌరభం అబ్బిన సౌందర్యాన్ని ఆఘ్రా ణించి కలుషితం చేయాలనిపించలేదు. ఆ సౌకు మార్యాన్ని నా కోరికల వేడితో కాల్చివేయా లనిపించలేదు నా చూపులు వాడికే ఆ నవవికసిత పారిజాతం కమిలిపోతుందేమోననీ, నా వ్రేళ్ల తాకిడికే ఆ నవనవోన్మేష ఉషస్సనిత హిమ

బిందువు కరిగిపోతుందేమోననీ భయం వేసింది. ఎంతోసేపటికి, తారా చంద్రులు రసరమ్య రాగ కేళిలో తేలి, అలసి సొలసిన చాలాసేపటికి ఆదిత్యుని తీక్ష్ణ కిరణ స్పర్శకే కమలం కన్ను తెరుస్తుందనీ, అగ్నితప్త కనకమే కళలు పెంచుకుంటుందనీ తట్టి, ఉషను హృదయ కవాటాలు తెరచి నా ప్రణయ జీవన సామ్రాజ్యంలోకి పూల దోసిళ్ళతో ఆహ్వానించాను.

''మీ ప్రేమ, మీ ఆరాధనా, మీ సౌందర్య పిపాస— ఇవే ఇవే నా రచనకు ఇన్‌స్పిరేషన్'' అంటుంది ఉష. ఉషకు ఇన్‌స్పిరేషన్ అయిన నాలోని ఆ అన్నింటినీ నామ రూపాల్లేకుండా నాశనం చేయాలనిపిస్తుంది. కానీ అవే లేకపోతే నా జీవితంలోని ఉషను నేనేం చేసుకోను? అవి వుండాలి. కానీ వుంటే... అవి ఉషకు ఇన్‌స్పిరేషన్. అదే నా కఖ్కర్లేదు. కానీ... ఓహ్ ! ట్రయాంగిల్ ఫైట్. ది టెరిఫిక్ హెడేక్.

ఉష పైకి వస్తున్న చప్పుడు.

మెట్లుగా మారిపోయిన నా గుండె ముక్కల పేర్పు !

నా హృదయపు టెరేస్‌మీద ఉష లేమెత్తని పాదాల స్పర్శ !

ఉష కడగంటి చూపుల వేడితో కరిగి కన్నీరైన నా నిబ్బరపు హిమనగరం !

నా ఊహాలు పచ్చి నిజపు పెనుగాలికి చెదిరిపోయింది. అంతా ఊహ. నా భ్రమ.

ఉష నిశ్శబ్దంగా గదిలోకి వచ్చింది.

ఎప్పుడో మేల్కొని అవిశ్రాంతంగా కొట్టుకుంటున్న నా వూహాలు ఉష గదిలోకి రాగానే క్షణం విశ్రాంతి తీసుకున్నాయి.

మంచంమీద బోరగిల పడుకున్నాను. నా తల మంచంపట్టె క్రిందికి జారివుంది.

జరీ అంచుగల పచ్చని చీరె కుచ్చెళ్ల క్రింద తెల్లని సుతిమెత్తని పాదాలు. ప్రతి ప్రేమికుడూ తన ప్రేమకు అర్పణ చేసుకునే అందమైన చోటు. నా అధరాల మధుకరాలు మరులుగొన్న చంపా పుష్పాలు. మనసులోనే సలాము చేశాను.

నా కళ్లు కొంచెం పైకి లేచాయి. కళ్ల మెట్లమీద చూపులు మునిగాళ్లమీద నిలబడ్డాయి.

ఆ యాంగిల్‌లో ఉష మరీ ఎత్తుగా కనిపించింది, హిమాలయమంత.

మట్టిలో ఆడుకుంటూన్న జబ్బు పిల్లాడిని చూసినట్లుగా చూసింది ఉష.

మట్టిలో ఆడుకుంటూన్నందుకు కోపం. జబ్బువెధవ కాబట్టి ఆ కోపాన్ని వ్యక్తం చేయ వీలులేని నిస్సహాయత.

ఆమె పూల పరిమళమంత పల్చని నిట్టూర్పు నేను తాగిన విస్కీ కంటే భయంకరంగా కాల్చింది నా గుండెల్ని.

ఉష నెందుకింత బాధపెడుతున్నాను ! ?

''భోజనం చేశారా ?'' ఉష.

ఛత్ ! చడామడా తిట్టకుండా చెత్త ప్రశ్న.



అయినా "నీవు లేకుండానే" నిజంగానే అన్నాను. నిజంకూడా.

"అది నేననవలసిన మాట" అంది.

ఉష ఎలాంటి పరిస్థితుల్లోనూ నన్ను నిర్లక్ష్యం చేయదు. ఎంత ఎత్తు ఎదిగినా నాకోసం తల వంచుతుంది. నావల్ల బాధ కలిగినా నాకోసం నవ్వుతుంది. అహం చూపవలసిన స్థితిలో వుండికూడా నాపట్ల అణకువ ప్రదర్శిస్తుంది. అంత మంచితనం నేను భరించలేను. ఆ మంచితనం ముందు నేను కుంచించుకుపోతున్నాను.

"లేవండి మరి. భోంచేద్దాం" ఒకడుగు ముందుకువేసి అంది. కడుపులో ఒరిపిడి.

నా కళ్లు వాలిపోయాయి.

"ఖాళీలేదు" అన్నాను.

ఉష దగ్గరగావచ్చి సీసాలను ఎంతో పదిలంగా పక్కకు జరిపింది. నేలమీద కూర్చుని నా జుట్టులోకి వేళ్లు జొనిపింది.

నా చూపుల లెవెల్‌కు ఉష వక్షస్థలంవుంది.

ఆమె గుండెలోని ఆ వేగాన్ని ఆమె వక్షస్థలం అందంగా చూపిస్తోంది.

బాధకూడా ఎంత అందంగా బయటపడే వీలుంది స్త్రీలో !

ఓ స్త్రీ ! నీకు జోహార్లు.

నా జుట్టును ఆత్మీయంగా నిమురుతూ ఎంతో జాలిగా అడిగింది ఉష "ఈపాటి మత్తు నా ప్రేమ కలిగించలేకపోయిందా శ్రీకాంత్ !?"

నో. ఎలాంటి స్థితిలోనూ ఉష దిగజారిపోవటం నేను భరించలేను.

పెదిమలు వంకరపోయినా, మాట తడబడినా, అక్షరాలను అస్తవ్యస్తంగానే అయినా కూర్చాను.

"ఉషి,... నీ... ప్రేమను ఈ మత్తుతో పోల్చి... దాని స్థాయిని దిగజార్చకు. అది... అమృతం. ఇది... విషం".

తన ప్రేమను అమృతం అన్నందుకు సంతోషించాలో, నేను విషాన్ని తాగుతున్నందుకు విచారించాలో తెలియనట్లుంది ఉషకు. వ్యర్థమైన చూపు చూస్తూ "తెలిసీ విషాన్ని తాగటం



ఎందుకు ?" అంది.

"బ్రతికే వీలులేక".

ఓపన్‌చేసిన బీరుసీసాలా ఆమె కళ్లు కన్నీళ్లతో పొంగాయి. పంటి ఆసరాతో పెదవి వణకు నాపుకుంది. ముఖం పైకెత్తి కళ్లు మూసుకుంది.

ఘనీభవింపజేయాలని ఉష చేసిన వ్యర్థ ప్రయత్నంనుండి తప్పించుకున్న రెండు కన్నీటి బిందువులు ఆమె అందమైన బుగ్గలమీదికి వురికివచ్చాయి, నా పెదవుల ముద్రలతో పులకించాల్సిన బుగ్గలమీదికి.

నామీద నాకే కోపం వచ్చింది.

నా మీద నేనే కోపగించుకోవడానికి ఉషను బాధించాలా ! నన్ను నేను కోపగించుకోవడం ఏమిటి ! ఏమైనా అర్థంవుందా ? అసలు నాకు బుర్ర వుందా ?

తలమీద తడుముకున్నాను.

మెత్తని మొగ్గల స్పర్శ.

ఉషను అనునయంగా అక్కున జేర్చుకోవాలని పిచ్చికోరిక కలిగింది. నా బుర్ర సంగతి మరచిపోయాను. పిచ్చి మరి.

ఔను. నాది పిచ్చే. కాకపోతే ఎవరిని ప్రేమిస్తున్నానో, ఎవరిని ద్వేషిస్తున్నానో నాకే తెలియదు.

లేవబోయాను.


రంగులరాట్నం మీద కూర్చున్నానా నేను!? అది తెగిపోయింది అంతలోనే. విరుచుకు ప...డ్డా...ను !

**ఉ ష :**

శ్రీకాంత్ గదిలో వెలుగుతూ కనిపించిన లైటు నా మనసులో ముసిరిన చీకటిని మరీ చిక్కబరిచింది. ఆ చీకటిలో తలఎత్తే ఆలోచనలు నలుపు పులుముకుని మరీ భయంకరంగా, జీమూతాల్లా...

కారు డోరు శబ్దంకాకుండా వేసి హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చున్నాను.

పని మనిషి రంగి ఏదో చెప్పబోయింది. "ష్" అన్నట్లుగా సౌంజ్ఞ చేశాను.




పైకి వెళ్లనా ? ఊహూ. శ్రీకాంత్ .. ఐ కాంట్ సీ. బట్... వెళ్లక పప్పదు; చూడక తప్పదు... ఎప్పడైనా.

శ్రీకాంత్ ఆనందంగా వుండాలి, తాగి అయినా సరే. కానీ ఆ తాగటంలో ఆనందాన్ని పొందుతూన్నట్లుగా కాక ఆవేదనను మరచిపోవాలన్నట్లుగా... అప్పుడు ఆయన తాగటం నాకు దుఃఖకరం కాదూ ?

బాధలకు బ్రాందీ తాపి మగతలో పడేయడం కంటే కాస్త ఆనందం అనే విషం ఇచ్చి చంపటం మేలు, బాధలను. శ్రీకాంత్‌కు నేను ఆనందం ఇవ్వటం లేదా ? ఊహూ. ఆవేదన కలిగిస్తూన్న అనుభూతి. నా వల్లా ! మే బి.

మరెవరైనా స్త్రీ ...

నో. నెవర్.

మరి,

కావాలి కావాలనే తహతహతో అందుకున్న ఈ జీవితం ఇంత పేలవంగా తయారవుతూందేమిటి !

ఆడ పిల్ల పూల గుండెలను స్పృశించే ఆ తుమ్మెద కళ్ల మగవాడు... నన్ను మరీ మరీ మనసుపడి సొంతం చేసుకున్నవాడు, అందిన నాతోటి జీవితంలో ఇంత వైరాగ్యాన్ని అనుభవించటమా ! లోపం ఎక్కడుంది ?

శ్రీకాంత్ కోసం నేను పెంచుకుంటూన్న మనో పరిధితో పాటే ఎక్స్‌పాండ్ అవుతూన్న బాధ ! ఆయన తాగుడుతో, ఆయన పడే వేదనతో సాంద్రత పెరిగి, చీకటి మూగి మనో కుడ్యాలను బీటలు వారుస్తూన్న బాధ ! ఆయన ముందు బయట పడకుండా గుండె గోడలతో నొక్కి వుంచవలసిన బాధ ! నవ్వు పూత పూసి తీపి మాత్రగా ఆయనను మాయపుచ్చవలసిన బాధ! ఎంత బాధ!

నా బాధ గురించి నాకు బాధ లేదు. అది ఆయన బాధలోంచి, ఆయన పడుతున్న బాధలోంచి, దాన్ని చూడలేక పోవడం నుంచి వచ్చిన బాధ. అందువల్ల ఆయన బాధ హరించటం ముఖ్యం. దానికి నేను చేయాల్సిందేమిటి ? తెలిసిన తప్పుకు సరిదిద్దుకునే అవకాశం వుంటుంది. తెలియందే !

నా ఆత్మ పరిశీలనలో నాకు లభించిన సమాధానం నాలో అన్నీవున్నా ఎక్కడో ఏదో లోపం. కనిపించని, అర్థంకాని అసంతృప్తి. బహుశా అదేమిటో శ్రీకాంత్‌కు తెలియదనుకుంటాను. ఈ అర్థంకాని బాధ, వివరించలేని క్లేశం హృదయాన్నంతగా నలిపివేస్తుందో నేనర్థం చేసుకోగలను. దాన్నుంచి శ్రీకాంత్‌ను తప్పించేమార్గం ఆలోచించాలి.

పైకి వచ్చాను. రాక తప్పదు.

జీవితంలో ఏదైతే ఎదురుపడకూడదనుకుంటామో అదే తప్పనిసరిగా ఎదురుపడటం జీవితంలోని విషాదం— కాదు— జీవితసహజం !



# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## భారత యుద్ధానికి కారణం!?

భారత యుద్ధానికి కౌరవుల అవినీతీ, అసూయా కారణమైనా, దానికి పూర్వరంగం ప్రబలమైనది లేకపోలేదు.

పార్వతీ పరమేశ్వరులు సంకల్పించిక ఒక యజ్ఞాన్ని పంచముఖుడైన బ్రహ్మ జరుపుతున్నప్పుడు, ఆ బ్రహ్మ పార్వతీదేవి సౌందర్యానికి ముగ్ధుడైనాడు. ఒక ముఖం నుంచి అతని ప్రణయపూర్వక దృష్టులు పార్వతీదేవిపై ప్రసరించాయి. పార్వతికి అసహ్యం కలిగింది. విరించి అక్రమ ప్రవృత్తిని ఆమె భర్తకు సూచించినది. శివుడు కోపించి ఆ బ్రహ్మ శిరస్సును ఛేదించి, అతణ్ణి చతుర్ముఖుణ్ణి చేశాడు. ఆ పాతకం ఊరికే పోలేదు ఆ బ్రహ్మహత్యా పాతకశక్తి శివుణ్ణి ఆవేశించి మిక్కిలి బాధించసాగింది.

ఒకనాడు మహేశ్వరుడు శ్రీహరి నివాసానికి వెళ్లి "భవతి! భిక్షాందేహి" అని భిక్షను యాచించాడు. అప్పుడు లక్ష్మీదేవి స్నానం చేస్తూ ఉండినది. ఆ మాటలు వినగానే ఆమె త్వరగా స్నానం ముగించి, ఒక వస్త్రం శరీరానికి చుట్టుకొని భిక్షం తెచ్చి, గడప దిగకుండా తలుపుచాటున నిలిచియే శివునికి వేసింది. గుమ్మందాటి రాకుండా, లోపలనుంచే భిక్ష పెట్టడం మహా పాతకం. ఆమె చేసిన ఆ తప్పువల్ల ఆ పాతకశక్తి శివుణ్ణి విడిచి లక్ష్మీదేవిని ఆవేశించి, ఆమెను మిక్కిలి బాధించసాగింది. ఆ బాధను భరించలేక లక్ష్మీదేవి శ్రీహరితో మొరపెట్టుకొనగా, ఆయన బాగుగా ఆలోచించి ఆ మహాశక్తిని ఉద్దేశించి "అమ్మా! నీ కోరిక ఏమో చెప్పుము. దానిని తప్పక నెరవేరుస్తాను. ఈమెను మాత్రం బాధించక విడిచిపెట్టు" అని అడిగాడు. అప్పుడా శక్తి "నాకు నరబలి కావాలి. సామాన్యమైనది పనికిరాదు. పదులూ, వేలతో నాకు తృప్తి కలగదు. లక్షల సంఖ్యలో నరులు బలికావాలి. అలా బలియిస్తే ఈమెను విడిచిపెడతాను" అన్నది. శ్రీహరి క్షణమాలోచించి "సరే! నీ కోరిక తప్పక నెరవేరుతుంది. ద్వాపర యుగంలో పాంచాలరాజు ద్రుపదునికి పుత్రికవై ద్రౌపది అనే ప్రసిద్ధ నామంతో పాండవులకు పత్నివై జన్మిస్తావు. క్రూర స్వభావులైన కౌరవులు కష్టాలపాలు చెయ్యగా, పాండవులతోపాటు కష్టాలు అనుభవించి, కౌరవులవల్ల అవమానం పొంది పగ సాధిస్తావు. నీ క్రోధాగ్నికి గురియై భారత మహా సంగ్రామంలో కౌరవులు నశించగలరు. ఇలా నీ కోరికను తీర్చగలను" అని వాగ్దానం చేశాడు. ఆ మహాశక్తి వెంటనే లక్ష్మీదేవిని విడిచి వెళ్లింది. ఆ శక్తియే ద్రౌపదిగా అవతరించి భారతయుద్ధానికి కారణమైనది. ★

---

సీసాలమధ్య శ్రీకాంత్— ఊహూ— ఖాళీ సీసాల మధ్య!

గుండెల్లోని వేదనను విస్కీపోసి పూడ్చబెడితే, పూరి మరీ వుబ్బిపోతుంది గానీ చస్తుందా? సగమౌతుందా?

ఎంత అమాయకవు శ్రీకాంత్!

తన కోసం నేనేమైనా చేయడానికి సిద్ధంగా వున్నాను. చివరికి నా రచనా వ్యాసంగాన్ని త్యజించడానికికూడా. ఆ ప్రేమ, ఆ ఆరాధననిండిన చూపు, ఆ శృంగారభావన- ఇవి చాలు నాకు. అయితే శ్రీకాంత్... నాతో సహకరించరు.

"నీ తప్పేమీ లేదు. అలా అనుకునే అపోహను నీకు కలిగిస్తే నన్ను క్షమించు" ఇదీ సమాధానం.

గదిలోకి అడుగు పెట్టాను.

శ్రీకాంత్... అస్తవ్యస్థంగా... మంచం మీద.

ఆయన కళ్లలోని తీవ్రమైనఎరుపు కనురెప్పలకూ పాకిజ్వలిస్తున్న భావన!

శ్రీకాంత్‌కళ్లు కొద్దిగా పైకి లేచాయి.

విచిత్రమైన చూపు! పాతాళంలోంచి హిమవన్నగ శిఖరాగ్రాన్ని చూస్తున్న భావన! అయినా ఆ చూపు నా కళ్లలోకే వుంది!

ఎంత విచిత్రం!

చిన్న సంభాషణ చివర నా గుండెల్లో పాడిచారు 'బతికే వీలులేక' అనే ఒక్క మాట ముక్కతో.

బాధగా కళ్లు మూసుకున్నాను. నా కళ్లలోని బాధ ఆయనకు తెలియటం ఇష్టంలేదు మరి.

జీవితం, నాతో జీవితం అంత మరణ సాదృశంగా వుందా! పోనీ ఆ భయంకర మృత్యుభావనను నా సాన్నిహిత్యం మరిపింప లేకపోతోందా! ఇంకెందుకూ నా సాన్నిహిత్యం? నా సాహచర్యం?

శ్రీకాంత్ తల మీది నా చేతి మీద వెచ్చని స్పర్శ. ఆ స్పర్శ ప్రసారం చేస్తున్న ప్రేమ. ఆ ప్రేమ కల్పిస్తున్న నా గుండె ప్రకంపనలు...

మరి?

ఊహూ. ఈ బాధ ఇక నేను ...

ఏదో దబ్బున పడ్డ శబ్దం.

కళ్లు తెరిచాను.

శ్రీకాంత్...క్రింద పడ్డాడు!

## లాయర్ :

వాళ్లిద్దరికీ నేనే లాయర్ని.

పరస్పర సహకారంతో, ఏకాభిప్రాయంతో వున్నారు కాబట్టే ఇద్దరి తరఫునా నాకు వకాల్తా ఇచ్చారు.

వృత్తి ధర్మంగా వకాల్తా స్వీకరించినా మానవధర్మంగా ఇద్దరినీ విడివిడిగా కన్విన్స్ చేయ ప్రయత్నించాను. విడివిడిగానే అయినా ఇద్దరిదీ ఒకేమాట!

"నాకోసం కాదు. అవతలివాళ్ల కోసం. వాళ్లకు అడ్డు రాకుండా వుండడం కోసం."

అంతకుమించి వాళ్లు ఏమీ చెప్పకపోయినా నా లాయర్ దృష్టినుంచి వాళ్ల గుండె లోతులు తప్పుకోలేకపోయాయి.

ఎంత మేధావి ఆలోచనలైనా ఎప్పుడూ తనవైపునుంచి ప్రారంభమై తనవైపునుంచే ముగుస్తూ వుంటాయి. దృష్టి కోణమైనా అంతే. తన స్థానాన్ని లోకం వైపు నిలబడి లోకం దృష్టితో చూడాలిగానీ తన మనసులోని వ్యర్థపుటాలోచనల అంధకారపు మారుమూలల నుంచి కాదు. ఈ కారణాన అందమైన జీవితాలు వికృతంగా ముగుస్తూ వుంటాయి.

వాళ్లిద్దరికీ విడాకు లిప్పించక తప్పలేదు. ✡